

దుర్గమ్మకు మొక్కులు

గోదావరిఖని: న్యూఫిల్టర్‌బెడ్ సివిల్ డిపార్ట్‌మెంట్‌లోని దుర్గామాత గుడిలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ దంపతులు పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సా॥)	సహర్ (ఉ॥)
కరీంనగర్	6.25	4.50
పెద్దపల్లి	6.33	4.57
రాజన్న సిరిసిల్ల	6.33	4.58
జగిత్యాల	6.33	4.57

గరిష్టం/కనిష్టం
33.6/21.2

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలంతా ఎండగా ఉంటుంది. ఉదయం, రాత్రి చలిగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

రాజకీయ పార్టీలతో సమావేశం

రామగుండం: పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించే విధానాలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణశ్రీ సమీక్షించారు. ముఖ్యంగా ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, బీఎల్‌వోల ఇంటింటి సర్వే, నూతన ఓటరు కార్డుల పంపిణీ తదితర అంశాలపై పార్టీ ప్రతినిధులతో చర్చించారు. ఈ సమావేశంలో రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల తహసీల్దార్లు గెరివేణ కుమారస్వామి, పనగంటి రామ్మోహన్‌రావు, జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్లు తిరుపతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను సవరించాలి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న అన్నయ్యగౌడ్ తదితరులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): మున్సిపాలిటీల్లో జీవో నంబరు 230 ద్వారా పెంచిన ఆస్తిపన్ను సవరించాలని సర్పంచుల ఫోరం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు అన్నయ్యగౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ సచివాలయం వద్ద మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం భూముల విలువను మూడుసార్లు పెంచిందని పేర్కొన్నారు. తద్వారా బల్దియాల్లో ఆస్తిపన్ను భారీగా పెరిగి యజమానులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆస్తిపన్ను సవరించాలని ఆయన కోరారు. తెలంగాణ సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు ఉప్పుల అంజనీప్రసాద్, జెడ్పీటీసీ మినుపాల స్వరూపరాణి, మాజీ సర్పంచ్ ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ గన్‌తో కోతులు పరార్



గన్‌లు విక్రయిస్తున్న నాగపూర్‌వాసులు

జ్యోతినగర్ (రామగుండం): మహారాష్ట్ర నాగ్‌పూర్ ప్రాంతానికి చెందిన అజయ్, దినేశ్ ప్లాస్టిక్ పైపులు, ఓ లైటర్‌తో శబ్దం వచ్చే గన్‌లు తయారు చేశారు. ప్రస్తుతం రామగుండం నగరలో వానరాల బెడద తీవ్రరూపం దాల్చింది. దీంతో నగరవాసులు ప్లాస్టిక్ గన్‌లు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. వీటిని పేల్చడం ద్వారా వచ్చే భారీ శబ్దాలకు కోతులు పరారవుతున్నాయి. బుధవారం ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వద్ద అజయ్, దినేశ్ తాము తయారు చేసిన ప్లాస్టిక్ గన్‌లు విరివిగా విక్రయించారు.

నేడు ఎన్టీపీసీకి ఆర్‌ఈడీ రాక

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రేమ్‌ప్రకాశ్ గురువారం రామగుండం ప్రాజెక్టులో పర్యటించనున్నారు. రామగుండం ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తిలో 40 ఏళ్లు పూర్తిచేసుకున్న క్రమంలో చేపట్టే కార్యక్రమానికి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గురుదీప్‌సింగ్ హాజరు కానున్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో ఆర్‌ఈడీ ప్రాజెక్టులో పర్యటించనున్నారు. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(తెలంగాణ స్టేజీ-1) లోని 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లను ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల జాతికి అంకితం చేసిన విషయం విదితమే. రామగుండం, తెలంగాణ ప్రాజెక్టుల్లోని పలు విభాగాలను ఆర్‌ఈడీ ప్రేమ్‌ప్రకాశ్ సందర్శించి ఉన్నతాధికారులతో సమావేశం కానున్నట్లు సమాచారం. ఆర్‌ఈడీ పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


ఆస్తిపన్ను వందశాతం వసూలు చేయాలి



డీపీవో ఆశలతను సన్మానిస్తున్న అధికారులు

రామగుండం: ఆర్థిక సంవత్సరాంతంలోగా నిర్దేశిత పన్నులు వందశాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశలత సూచించారు. అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో అంతర్గాం, పాలకుర్తి మండలాల అధికారులతో బుధవారం ఆమె ఆస్తిపన్ను వసూళ్లపై సమీక్షించారు. తొలిసారి వచ్చిన డీపీవో ఆశలతను తొలుత శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామాల వారీగా పన్ను వసూలు, ఇతర అంశాలపై సమీక్షించారు. అంతర్గాం ఎంపీడీవో అలీం, రెండు మండలాల ఎంపీవోలు వహీద్, షబ్బీర్, మండల పరిషత్ సూపరింటెండెంట్ మామిడాల కరుణాకర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

పూట గడిచేదెట్లా?



కరీంనగర్‌కు చెందిన రమేశ్ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. మంగళవారం నుంచి అతని సేవలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో డెలివరీబాయ్‌గా పనిచేసుకునేందుకు సిద్ధమయ్యాడు.

సర్వశిక్ష అభియాన్‌లో పీడీగా పనిచేసే సిబ్బంది తమకు వచ్చే నెలలో 'నోవర్క్ నో పే' వస్తుందని గ్రహించి, ముందుగానే మరో చోట ట్యూషన్లు చెప్పుకోవడం లేదంటే.. రాపిడో, ఉబర్ వంటి సంస్థల్లో రైడర్‌గా చేరాలని నిర్ణయించుకున్నారు.



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు(ఫైల్), (ఇన్‌సెట్లో) వరంగల్‌లో జరిగిన దీక్షల్లో సంఘీభావం తెలుపుతున్న అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి(ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

- ఉమ్మడి జిల్లాలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్వాసన
- మూడు రోజుల నుంచి రెండు నెలలపాటు 'నో వర్క్ నో పే'
- సీఎం రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకోవాలని వేడుకోలు
- కుటుంబ పోషణకు దినసరి కూలీలు అవుతామని ఆవేదన
- వివిధ విభాగాల్లో 11వేల మందికిపైగా సిబ్బంది

ఔట్‌సోర్సింగ్ విధానంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి మార్చి వచ్చిందంటే గుండెదడే. ఎప్పటిలాగే మీ సేవలను తాత్కాలికంగా పక్కన పెడుతున్నామంటూ ప్రభుత్వం నుంచి ఈ ఏడాది కూడా ఆదేశాలు వచ్చాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా ఈ తాత్కాలిక ఉద్వాసన వల్ల వేసవిలో మూడురోజుల నుంచి రెండు మాసాలపాటు ఉపాధి కోల్పోయేవారు దాదాపు 11,000మంది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న వేళ ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ప్రభుత్వం నుంచి వివిధ విభాగాల్లో కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి టెర్మినేషన్ ఆదేశాలు అందుతున్నాయి. దీంతో ఏదోఒక పనిచేసి కుటుంబాన్ని పోషించుకునేందుకు సిద్ధమవుతున్నారు. వీరిలో చాలామంది పదో తరగతి నుంచి పీజీలు, పీహెచ్‌డీలు చేసిన వారు ఉన్నారు. అంతా ఆయా విభాగాల్లో ఏళ్లుగా కొనసాగుతున్న వారే. అయితే, వీరెవరూ ఏ కార్యాలయంలోనూ 365 రోజులు పనిచేసిన దాఖలాలు లేవు.

కారణం ఏమిటి?

చాలా ప్రభుత్వ విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. విద్య,వైద్యారోగ్యశాఖల్లో ఈ కొరత అధికం. మిగిలిన విభాగాల్లోనూ ఆఫీసు, ఫీల్డ్‌లెవల్‌లో పనిచేసేందుకు సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమించుకుంటున్నాయి. వీరికి ఈఎస్‌ఐ, పీఎఫ్ సదుపాయాలు ఉంటాయి. కానీ ఏడాదిపాటు ఎట్టిపరిస్థితుల్లో కొనసాగనివ్వరు. కనిష్ఠంగా మూడు రోజుల నుంచి గరిష్ఠంగా రెండు నెలలపాటు వీరికి తాత్కాలికంగా ఉద్వాసన పలుకుతారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో వీరిని తిరిగి తీసుకుంటారు. అప్పటి వరకూ 'నో వర్క్.. నో పే' విధానం అమలు చేస్తారన్న మాట. ఈ కాలంలో ఎలాంటి వేతనం రాదు కాబట్టి ఈ ఉద్యోగులంతా కూలోనాలో చేసుకుని జీవించాల్సిందే. 365 రోజులపాటు వీరు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులుగా పనిచేస్తే.. కొన్నేళ్ల తరువాత తమను రెగ్యులరైజ్ చేయాలంటూ న్యాయస్థానాల్లో కేసులు వేస్తారన్న అభద్రతాభావంతో ప్రభుత్వమే వారిని ఏటా కొంతకాలం పాటు తొలగించి, తిరిగి కొత్త నియామకం కింద చూపిస్తుంది.

ఉమ్మడి జిల్లాలో 11 వేలమంది

ఔట్‌సోర్సింగ్ విధానంలో కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో మొత్తం దాదాపు పదకొండు వేలమందికిపైగా సిబ్బంది పనిచేస్తున్నారు. వీరందరినీ ఇప్పుడు విభాగాల వారీగా వారి అవసరాన్ని బట్టి తొలగించి, కొన్ని రోజులు లేదా వారాల తరువాత తిరిగి నియమించుకుంటారు. ఈ విధానం రద్దు చేయాలంటూ సర్వశిక్షా అభియాన్ సిబ్బంది గతేడాది దాదాపు 25 రోజులపాటు సమ్మె చేశారు. గత ప్రభుత్వంలో ఎలాగూ తమకు ఇబ్బందులు తప్పలేదని, కనీసం తాజాగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమకు న్యాయం చేయాలని సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంలో బయటికి వచ్చి గోడు వెళ్లబోసుకుందామని అనుకున్నా.. ఎక్కడ తిరిగి విధుల్లోకి చేర్చుకోరో అన్న భయంతో వెనకడుగు వేస్తున్నారు.

సీఎం మాట నిలబెట్టుకోవాలి



ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి 2023 సెప్టెంబరు 13న ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలోనే వరంగల్‌లోని మా దీక్షా శిబిరాన్ని సందర్శించారు. తాము అధికారంలోకి రాగానే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అన్నిరకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఎలాగూ మమ్మల్ని పట్టించుకోలేదు. కనీసం ఈ సీఎం అయినా మా సమస్యలు పరిష్కరించాలి. మాకు ఉద్యోగ భద్రత కల్పించి, క్రమబద్ధీకరించాలి.

– బెజ్జంకి ఆంజనేయులు, ఎస్ఎస్ఏ జేఏసీ కరీంనగర్ అధ్యక్షుడు

రెగ్యులరైజ్ చేయాలి



శాశ్వత ప్రాతిపదికన పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందజేయాలి. కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్న తీరును ప్రభుత్వానికి ఎన్నోసార్లు విన్నవించాం. అయినా ఫలితం లేదు. ప్రభుత్వం వెంటనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలి.

– ఎడ్ల రమేశ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

12 నెలల వేతనం ఇవ్వాలి

విద్యాశాఖలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి రెండు నెలలపాటు వేతనాలు చెల్లించాలి. సీఎం రేవంత్ గత ఎన్నికల ముందు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వెంటనే అమలు చేయాలి. ఈ రెండు నెలలు ఆ సిబ్బంది కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఆదుకోవాలి.

– డాక్టర్ బీఎస్ రావు, బీఆర్ఎస్ నాయకుడు

సౌర విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయండి



మాట్లాడుతున్న జీఎం జానకీరామ్

రామగిరి(మంథని): ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-1 ఉపరితల గని ఓబీ డంప్‌పై చేపట్టిన 22 మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని సోలార్ విద్యుత్ విభాగం జీఎం జానకీరామ్ ఆదేశించారు. ఆర్జీ-3 జీఎం కార్యాయంలో జీఎం సుధాకర్‌రావుతో కలిసి సౌరవిద్యుత్ ప్రాజెక్టు ప్రగతి పనులపై బుధవారం అధికారులతో సమీక్షించారు. 22 మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రం పనులు మే15వ తేదీలోగా పూర్తిచేయాలన్నారు. ఇందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఏరియా ఇంజినీర్ ఏలీషా, డీజీఎం శ్రీనివాస్, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డితోపాటు సోలార్ కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



పాలకమండలి సభ్యులతో నర్సయ్య తదితరులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మత్స్యకార్మికుల సంక్షేమానికి తనవంతుగా పాటుపడతానని మత్స్య పారిశ్రామిక సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొలిపాక నర్సయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పాలకమండలి సభ్యులతో కలిసి ఆయన పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. చేపల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల కుటుంబాలకు చేయూత ఇచ్చేలా ప్రభుత్వ పథకాలను అందించేందుకు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయసహకారాలతో ముందుకు సాగుతావని అన్నారు.

పాలకమండలి ఏకగ్రీవం...

జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘ పాలకమండలిలోని 11 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరంతా బుధవారం ఎన్నికల అధికారి రామ్మోహన్ సమక్షంలో సమావేశమై జిల్లా అధ్యక్షుడిగా కొలిపాక నర్సయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్‌చైర్మన్‌గా బొజ్జ సారయ్య(రాతుపల్లి, కాల్వ శ్రీరాంపూర్ మండలం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారితో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. పాలకమండలి సభ్యులు వీరస్వామి, కందుల శ్రీనివాస్, తాళ్ల తిరుపతి, చెట్ల శ్రీనివాస్, పెద్దపల్లి సుజాత, క్రాంతికుమార్, పాలవేణి మొండయ్య, బొయిని శ్రీకాంత్, రేండ్ల కోటయ్యతో పాటు ముదిరాజ్ సంఘం నాయకులు కొలిపాక శ్రీనివాస్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా నామినేషన్ ప్రక్రియ

- స్వీకరణ, పరిశీలనపై అవగాహన అవసరం
- అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించే ప్రక్రియ సజావుగా సాగాలని, ఇందుకోసం కట్టుదిట్టమైన ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్, పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి నామినేషన్ల ప్రక్రియ నిర్వహించేందుకు అవసరమైన ప్రక్రియపై అధికారులకు అవగాహన కల్పించారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీఅవుతుందన్నారు. అప్పటి నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29లోగా నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియంతా ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా, సజావుగా సాగేలా చూడాలన్నారు. నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థికి ఎన్నికల సంఘం నియమావళితోపాటు ఎన్నికల వ్యయం వివరాలు, రేటుచార్ట్, ఎన్నికల వ్యయ జిస్టర్, ఓటరు జాబితా తదితర సమాచారం మొత్తం అందించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణపై ముందస్తు డ్రైరన్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, ఏవో శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మహాత్మా.. మన్నించవా!



అహింసా మార్గం అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుందని మహాత్మాగాంధీ భావించారు. ఆచరించారు. మనదేశ స్వాతంత్ర్య సాధన కోసం మహోద్యమం నడిపించారు. చివరకు విజయం సాధించారు. భారతీయులకు మహాత్ముడయ్యారు. ఆయన స్ఫూర్తితో ప్రజాప్రతినిధులు, పాలకులు ప్రజారంజక పాలన అందిస్తున్నారు. శాస్త్ర, సాంకేతిక, విద్య, వైజ్ఞానిక, ఆర్థిక.. ఇలా ఒక్కటేమిటీ అన్ని రంగాల్లో ప్రపంచ దేశాల సరసన నిలబెడుతున్నారు. ఇదంతా నాణేనికి ఒకవైపే.. రెండోవైపు.. ఇదిగో ఈ చిత్రంలో కనిపిస్తోంది. మహాత్మాగాంధీ వేషధారణతో రహదారుల వెంట కాసేపు యాచన చేసిన ఈ వ్యక్తి.. ఆశించిన పైకం రాక.. ఆ పూట కడుపునిండే పరిస్థితి లేక.. ఆ వెంటనే చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు ఏరుకున్నాడు.. వాటిని తీసుకెళ్లి స్క్రాప్ దుకాణంలో విక్రయించాడు. వచ్చిన సొమ్ముతో ఆరోజుకు సరిపడా నిత్యావసరాలు కొనుగోలు చేసి తీసుకెళ్లాడు. గోదావరిఖని నగరంలో 'సాక్షి'కెమెరాకు చిక్కింది ఈ అరుదైన చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

వేసవిలో మాంసాహారానికి దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ పద్మజ

గోదావరిఖని: వేసవిలో డీహైడ్రేషన్‌కు గురికాకుండా మాంసాహారం, మసాలా దినుసులకు దూరంగా ఉండాలని హెల్త్‌ఆఫీసర్ పద్మజ సూచించారు. బుధవారం ఓసీపీ-3లో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన కల్పించారు. వడదెబ్బకు గురైతే.. తలనొప్పి, తలతిరగడం, వాంతులు కావడం, నీరసం, ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు వంటి లక్షణాల ఉంటాయన్నారు. వడదెబ్బ తీవ్రమైతే స్పృహ కోల్పోయి అపస్మారక స్థితికి చేరే ప్రమాదం ఉందని తెలిపారు. వడదెబ్బకి గురైన వ్యక్తిని చల్లటి ప్రాంతానికి తరలించి శరీరానికి గాలి తగిలేలా చూడాలన్నారు. స్పృహలో ఉంటే ఓఆర్ఎస్ లేదా నిమ్మరసం, మజ్జిగ కొద్దికొద్దిగా తాగించాలన్నారు. వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. నీళ్లు ఎక్కువగా తాగాలని, తాజా ఆహారం, పుచ్చకాయ, కీరదోసకాయ, తాటి ముంజలు వంటివి ఎక్కువా తినాలన్నారు. మద్యపానం, శీతల పానీయాల(కూల్‌డ్రింక్స్)కు దూరంగా ఉండాలన్నారు. మాంసం, వేపుళ్లు తీసుకోకూడదన్నారు. ఎండలోకి వెళ్లినపుడు లేతరంగు దుస్తులు ధరించాలని, తలకుటోపీ లేదా తలపాగా ధరించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రాజెక్టు మేనేజర్ రమేశ్, రక్షణాధికారి భరత్‌కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన జనక్‌ప్రసాద్



సీఎంను సన్మానిస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: మినిమం వేజ్‌బోర్డు అడ్వయిజరీ బోర్డు కార్పొరేషన్ చైర్మన్ జనక్‌ప్రసాద్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. శాలువాతో సన్మానించి, మొక్క అందజేశారు. తనకు పదవి ఇవ్వడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

అడుగంటిన 'ఎస్సారెస్పీ'



ఎస్సారెస్పీలో తగ్గిన నీరు

- పడిపోయిన నీటిమట్టం
- ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.30 టీఎంసీలు
- గతేడాది ఇదే రోజు 33.764 టీఎంసీలు
- ఈ నెల 25 వరకే చివరి నీటి తడి ఇస్తామన్న అధికారులు
- యాసంగి పంటలు పండేనా?
- ఆందోళనలో ఉమ్మడి జిల్లా రైతులు

జగిత్యాల అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాకు సాగు, తాగునీరందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) నీటిమట్టం రోజురోజుకూ తగుతోంది. బుధవారం నాటికి 19.316 టీఎంసీలకు పడిపోయింది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రాజెక్టు అధికారులు సైతం జోన్-1 ఆయకట్టు(డీ-5 నుంచి డీ-53)కు ఈ నెల 25 వరకు మాత్రమే చివరి సాగు నీటి తడి ఇస్తామని ప్రకటించారు. ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుతుండటంతో వేసవిలో సాగు చేసిన వరి పంట పండేనా అని అన్నదాతలు దిగులు చెందుతున్నారు.

ఇష్టారీతిన వినియోగంతోనే సమస్య

ఈ ఏడాది ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినప్పటికీ ఓ ప్రణాళిక అంటూ లేకుండా నీటిని ఇష్టారీతిన వినియోగించడంతో సాగు నీటికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి వచ్చింది. ప్రజాప్రతినిధులు చెప్పిందే వేదం, అవసరమున్నా, లేకున్నా, వానాకాలం, ఎండాకాలం తేడా లేకుండా ఎస్సారెస్పీ అధికారులు ఎప్పుడు పడితే అప్పుడు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినప్పుడు మాత్రమే వరద నీటిని గోదావరిలోకి విడుదల చేయాల్సి ఉండగా నిబంధనలకు తిలోదకాలిచ్చారు. వరద కాల్వకు సైతం కాకతీయ ప్రధాన కాల్వ మాదిరిగా నీటిని విడుదల చేస్తుండటం కాల్వ ఆయకట్టు రైతులకు సమస్యగా మారింది. ఎస్సారెస్పీ కాల్వలకు ఇష్టారీతిన తూములు ఏర్పాటు చేసి, సాగు నీటిని చెరువులకు మళ్లిస్తున్నారు. దీంతో, చివరి ఆయకట్టుకు నీటి విడుదల సరిగా జరగక ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కడో ఓచోట అన్నదాతలు రోడ్డెక్కుతూనే ఉన్నారు.

7 లక్షల ఎకరాల ఆయకట్టు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎస్సారెస్పీ కింద 7 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే.. ఇందులో 3 లక్షల ఎకరాలు ఒక్క జగిత్యాల జిల్లాలోనే ఉంది. ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగికి వరినే అత్యధిక విస్తీర్ణంలో(80 శాతం) సాగు చేశారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో వరి పంట పొట్ట దశలో ఉంది. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. ఇప్పుడు నీరందకపోతే చాలా కష్టం. ప్రాజెక్టు నుంచి మరో 9 టీఎంసీల నీరు మాత్రమే విడుదల చేసే అవకాశం ఉంది. తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీల నీటిని డెడ్ స్టోరేజీగా ప్రాజెక్టులోనే ఉంచుతారు. అయితే, రానున్న రోజుల్లో ఎస్సారెస్పీ నుంచి సాగు నీరందే పరిస్థితులు కనిపించడం లేదు. రైతులు వ్యవసాయ బావులపైనే ఆధారపడి, పంటలను కాపాడుకోవాల్సిన దుస్థితి ఎదురవనుంది.

ప్రాజెక్టులోకి 203.992 టీఎంసీలు

ఎస్సారెస్పీలోకి గత జూన్ 1 నుంచి ఇప్పటివరకు 203.992 టీఎంసీల నీరు చేరింది. అయితే, ప్రాజెక్టులో ఉన్న పాత నీటిని కలుపుకొని మొత్తం 205.658 టీఎంసీలను సాగు, తాగునీటి అవసరాలకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091.00 అడుగులు కాగా, ప్రస్తుతం 1,064.40 అడుగులు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 90.30 టీఎంసీలకు ప్రస్తుతం 19.316 టీఎంసీలకు పడిపోయింది. గతేడాది ఇదే రోజున 33.764 టీఎంసీలు ఉండటం గమనార్హం. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి కాకతీయ కాల్వకు 3,500 క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 250, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 347, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో చెరువులకు 312, సరస్వతి కెనాల్‌కు 400, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

క్లుప్తంగా

పరీక్షలు తెలుగులో నిర్వహించాలి



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

గోదావరిఖని: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులతో వివిధ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు చేపట్టే పరీక్షలను తెలుగు మాధ్యమంలో నిర్వహించాలని కార్మికులు కోరారు. బుధవారం స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఏఐటీయూసీ నాయకులను కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ కృషితో యాజమాన్యం పలు ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు జారీ చేస్తోందన్నారు. అనంతరం ఏఐటీయూసీ నాయకుడు మడ్డి ఎల్లయ్య మాట్లాడుతూ, సంస్థలో చాలామంది సీనియర్ కార్మికులు తెలుగు మీడియంలో చదివిన వారు ఉన్నారని, వీరికి ఇంగ్లిష్‌లో పరీక్షలు నిర్వహించడం ద్వారా నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఇంగ్లిష్‌తోపాటు తెలుగులో కూడా పరీక్షలు నిర్వహించాలని యాజమాన్యాన్ని కోరుతామని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆరెల్లి పోశం, మిట్ట శంకర్, దొంత సాయన్న, బలుసు రవి, ప్రభుదాస్, సమ్మయ్య, రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

మంథని: ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టు మీదుగా కారులో అక్రమంగా తరలిస్తున్న 18 బీర్ బాటిళ్లను బుధవారం రాత్రి అధికారులు పట్టుకున్నారు. మంథని నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం పెద్ద తూండ్లకు కిరాణ సామగ్రితోపాటు బీర్ బాటిళ్లు తరలిస్తుండగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు.

మళ్లీ మోదీ సర్కార్ వస్తుంది



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్: దేశప్రజలంతా ప్రధానమంత్రిగా మళ్లీ నరేంద్రమోదీనే కోరుకుంటున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. రాఘవాపూర్ గ్రామంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పలు పార్టీలకు చెందిన నాయకులకు బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమంతోపాటు దేశరక్షణకు ప్రధాని మోదీ అత్యధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. ప్రపంచంలో ఆర్థికంగా శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దేందుకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఠాకూర్ రాంసింగ్, పిన్నింటి రాజు, పర్శ సమ్మయ్య, చాతరాజు నరేశ్, శ్రీనివాసరావు, సదయ్య, బద్దేశ్, పల్లె సదానందం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

గోదావరిఖని: ఓసీపీ–3 బేస్‌వర్క్‌షాప్‌లో సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. బుధవారం అధికారులను కలిసి నూతన ఫిట్ కమిటీ సభ్యులను పరిచయం చేశారు. కమిటీ సెక్రటరీగా పూసాల సంపత్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలుగా కుమారస్వామి, కొమురయ్య, ట్రేడ్స్ మెన్ కమిటీ సెక్రటరీగా కనకయ్య, సెక్షన్ ఇన్‌చార్జిగా అశోక్‌గౌడ్, నాయకులు నాయకులు కృష్ణ, రాంకుమార్, రామయ్య, శివకృష్ణ, మల్లయ్య, శ్రీనివాస్, రవి, కుమారస్వామిలను పరిచయం చేశారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి జిగురు రవీందర్, ఉపాధ్యక్షుడు అన్నారావు, బ్రాంచ్ సహాయ కార్యదర్శులు ఉన్నారు.

మధ్యాహ్నం బడి కష్టాలు!

- పదో తరగతి సెంటర్ ఉన్న చోట పనివేళల మార్పు
- మధ్యాహ్నం 3గంటల తరువాత అందుతున్న మధ్యాహ్న భోజనం
- జగిత్యాలలో పరీక్ష ఉన్నా లేకున్నా.. మధ్యాహ్నమే పనివేళలు
- అయిష్టంగానే హాజరవుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



జిల్లా	పరీక్ష కేంద్రాలు	పది విద్యార్థులు	1–9 విద్యార్థులు
కరీంనగర్	75	12,458	38,877
సిరిసిల్ల	45	7,725	68,775
జగిత్యాల	35	6,475	25,535
పెద్దపల్లి	64	11,394	47,433

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వేసవి మొదలైంది. ప్రభుత్వ పాఠశాలల పిల్లల్ని ఎండల బారి నుంచి కాపాడేందుకు ప్రభుత్వం ఒంటి పూట బడులను ప్రారంభించింది. సాధారణంగా ఒంటి పూటబడి అంటే ఉదయం పూటే తరగతులు ముగించుకుని మధ్యాహ్నం ఎండ జోరు పెరిగేలోగా విద్యార్థులు ఇళ్లు చేరుకోవాలి. అయితే, ఇక్కడే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందలాదిమంది పిల్లలకు చిక్కులు ఎదురవుతున్నాయి. ఆ వెంటనే పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. ప్రతీ మండలంలోని రెండు లేదా మూడు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలు నడుస్తున్నాయి. దీంతో విధి లేక ఒంటి పూట బడికి మధ్యాహ్నం సమయంలో హాజరవాల్సి వస్తుంది. పరీక్ష ఉన్న రోజుల్లో ఎలాగోలా ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్దుకుంటున్నారు. కానీ, ఒక్క జగిత్యాల జిల్లాలో పది పరీక్షలు ముగిసేదాకా మధ్యాహ్నం పనివేళలే కొనసాగుతాయని ఉన్నతాధికారులు చెప్పడంతో ఆ జిల్లా విద్యార్థులు కంగుతిన్నారు. చేసేది లేక ఎండలోనే పాఠాలకు హాజరవుతున్నారు.

ఏంటి సమస్య?

రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15 నుంచి ఒంటి పూట బడులు మొదలయ్యాయి. మూడు రోజుల వ్యవధితో పదో తరగతి పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాలు కూడా మంజూరయ్యాయి. ఈ క్రమంలో ఒంటిపూట బడి అమలు చేసే విషయంలో వీరు పనివేళలను మార్చుకోవాల్సి వచ్చింది. సాధారణంగా ఉదయం 7.45 గంటలకు మొదలైన పాఠశాల పనివేళలు మధ్యాహ్నం 12.30 గంటల వరకు సాగాలి. అయితే, పరీక్షా కేంద్రాలు కేటాయించిన చోట విద్యార్థులు తమ ఒంటి పూట బడిని అనివార్యంగా మార్చుకోవాల్సి వచ్చింది. దీంతో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు అన్ని జిల్లాల విద్యార్థులు మధ్యాహ్నం 1 గంటలకు పాఠశాల పనివేళలు మొదలై సాయంత్రం 5 గంటల వరకు సాగుతున్నాయి. ఈక్రమంలో పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండ, ఉక్కపోత వల్ల పాఠాలు సరిగా వినలేక పోతున్నారు. మరోవైపు మధ్యాహ్నం ఒంటిపూట పాఠశాల నడుస్తున్న క్రమంలో అందులో విద్యనభ్యసించే వారికి భోజనం పూర్తయి వడ్డించే సరికి మ.3గంటలు దాటుతోంది. అప్పటి వరకు ముఖ్యంగా హాస్టల్‌లో ఉండే పిల్లలు ఆకలితో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల తరగతుల్లో ఫ్యాన్లు, తాగునీరు సదుపాయాలు పూర్తిస్థాయిలో లేవని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈనెల 30వ వరకు పదో తరగతి పరీక్షలు నడుస్తాయి. రోజు విడిచి రోజు పరీక్షలు జరగనున్నాయి. సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో పరీక్షలేని రోజుల్లో ఉదయం పూటే తరగతులు జరుగుతున్నాయి. కానీ, ఒక్క జగిత్యాల జిల్లాలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. కనీసం పది పరీక్షలు లేని రోజుల్లోనైనా తమకు ఉదయంపూట బడి నడిచేలా జిల్లా విద్యాధికారి (ఈడీవో) అయినా చొరవ తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మా నాన్న ఎలా చనిపోయాడు!



న్యాయం చేయాలని వేడుకుంటున్న సుబ్బారావు కుటుంబసభ్యులు

- వంట మనిషి సుబ్బారావు కుటుంబ సభ్యుల ఆవేదన

జ్యోతినగర్(రామగుండం): వంటలు తయారు చేసే ఓ కాంట్రాక్టు కంపెనీ నిర్వాహకులు పనులు చేసేందుకని తమ తండ్రి ఈర సుబ్బారావు(58)ను రామగుండం ఎన్టీపీసీకి తీసుకొచ్చారని, ఆ తర్వాత ఏమైందో గానీ, కొద్దిరోజులకే శవాన్ని అప్పగించారని మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణానికి చెందిన బాధితుల కథనం ప్రకారం.. సుబ్బారావు పలు కంపెనీల్లో వంటలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గతేడాది మార్చిలో ప్రభాత్ ఇంజినీరింగ్ వర్క్స్ కంపెనీ ద్వారా ఎన్టీపీసీ రామగుండం ప్లాంట్ క్యాంటీన్‌లో పనులు చేసేందుకు రప్పించారు. అయితే, ఆ కంపెనీకి చెందిన ఓ వ్యక్తి 2023జూలై 30న సుబ్బారావు చనిపోయాడని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రామగుండం బయలుదేరిన కుటుంబసభ్యులు.. వరంగల్ చేరుకునేలోగా ఆ వ్యక్తి మరోసారి ఫోన్‌చేసి మృతదేహాన్ని భద్రాచలం పంపిస్తున్నామని చెప్పాడు. వెనుదిరిగిన కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మిగతా విషయాలు తర్వాత మాట్లాడుకుందామని నచ్చజెప్పి వెళ్లిపోయారు. తమ తండ్రి ఎలా చనిపోయాడని ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వలేదు. పైగా సెటిల్ చేద్దామన్నారు. ఈవిషయంలో పోలీసులకు ఫిర్యాదు చేకుండా అడ్డుకున్నారు.

మాకు న్యాయం చేయండి

వంట పనుల కోసం మా నాన్నను ఎన్టీపీసీ తీసుకొచ్చిన కంపెనీ నిర్వాహకులు చంపి మృతదేహాన్ని అంబులెన్స్‌లో మా ఇంటికి తీసుకొచ్చి వదిలేసి వెళ్లిపోయారు. ఆయన చనిపోయి ఏడు నెలలు కావస్తున్నా కంపెనీ వారు మమ్మల్ని సంప్రదించడం లేదు. ఫోన్‌చేస్తే సమాధానం ఇవ్వడం లేదు. మృతదేహంతో పంపిన కాగితాల్లో కూడా మృతికి గల వివరాలు పొంతన లేకుండా ఉన్నాయి. న్యాయం చేయాలని ఎన్టీపీసీ పోలీసులకు విన్నవించాం. మాది పేద కుంటుంబం. మా అమ్మ మంగ గతంలోనే చనిపోయింది. మా నాన్న సుబ్బారావు మా ఐదుగురు సంతానాన్ని కష్టపడుతూ పోషించాడు. ఇప్పుడు నాన్న లేడు. మాకు ఆధారం లేకుండా పోయింది. మా కుటుంబానికి న్యాయం చేయండి. తమ్ముడు విజయదుర్గాప్రసాద్ కూడా గతంలోనే చనిపోయాడు. ఇప్పుడు మాకు ఆసరా లేకుండాపోయింది. కార్మిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు జోక్యం చేసుకుని మా కుటుంబానికి న్యాయం చేయండి.

– ఈర మురళీ కృష్ణ(కుమారుడు), కుల్పగిరి దేవకి(కూతురు), భద్రాచలం

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

- తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో పనిచేస్తున్న 32వేల మంది కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా ఉద్యమాలకు సిద్ధ కావాలని కార్మికులను కోరారు. వచ్చేనెల 7న రామగుండం రీజియన్ మహాసభ గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన లక్ష్యంగా సంఘం పనిచేస్తోందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సంస్థ విధ్వంసానికి గురైందని విమర్శించారు. ఈసందర్భంగా మహాసభల వాల్‌పోస్టర్ విడుదల చేశారు. సమావేశంలో ఆహ్వాన కమిటీ సభ్యురాలు శైలజ, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కామర గట్టయ్య, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజన్న, నాయకులు దేవి సత్యం, జైపాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివరాహస్వామి ఆదాయం రూ.5లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీఆదివరాహస్వామి ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. స్వామివారి దర్శనం కోసం గత ఆరు మాసాలుగా వచ్చిన భక్తులు హుండీల్లో వేసిన కట్న, కానుకలను లెక్కించారు. ఈసందర్భంగా రూ.5,06,601 నగదుతోపాటు, వెండి, బంగారం సమకూరినట్లు ఆలయ ఏవో కాంతారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థిని మృతి



హన్సిక (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: దుబ్బపల్లి గ్రామ సమీప రాజీవ్ రహదారిపై బుధవారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి తెలికుంట హన్సిక(17) అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె సోదరుడు భానుప్రకాశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శ్రావణ్ కుమార్ కథనం ప్రకారం.. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన తెలికుంట హన్సిక జూలపల్లి మండలం తెలుకుంటలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ చదువుతోంది. బుధవారం కరీంనగర్ విద్యానగర్‌లోని తన బాబాయి ఇంటికి పనిపై వెళ్లింది. బాబాయ్ కొడుకు భానుప్రకాశ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్‌కు బయలు దేరింది. ఈక్రమంలో దుబ్బపల్లి వద్ద లారీ వెనుక నుంచి వచ్చి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హన్సిక తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రగాయాలైన భానుప్రకాశ్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. కాగా, కూలీ పనులు చేస్తూ తన ఇద్దరు కూతుళ్లను పెంచి పెద్దచేసిన పద్మ.. చేతికి అందివచ్చిన చిన్నకూతురు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో కన్నీటిపర్యంతమవుతోంది.

మారుపేర్ల సమస్య పరిష్కరించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని: సింగరేణిలో మారుపేర్ల సమస్య వెంటనే పరిష్కరించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్‌కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుపేర్ల మార్పిడి కోసం వేలాది మంది కార్మికులు అవస్థలు పడుతున్నారన్నారు. ఏళ్లతరబడి ఆందోళనలు నిర్వహించారని అన్నారు. డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమిషనర్ వద్ద మెమొరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ 12/3 సెటిల్‌మెంట్ ఒప్పందాన్ని సింగరేణి యాజమాన్యం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా పలువురు యూనియన్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల హరిణ్, బోడకుంట రాజేశం, పెంచాల వెంకటస్వామి, తాట్ల లక్ష్మయ్య, తుమ్మ గట్టయ్య, బండి మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌కల్చరల్: కదిలేది.. కదిలించేది.. పెనునిద్రను వదిలించేది.. మనిషిని ముందుకు నడిపించేది కవిత్వం. సమాజ శ్రేయస్సే కవిత్వం పరమావధి కావాలన్నది నిర్వివాదాంశం. సామాజిక చైతన్యాన్ని కలిగించే కవితలు ప్రపంచాన్ని శాసిస్తాయి. 1999లో ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్ జరిగిన యునెస్కో 30వ సదస్సులో మార్చి 21వ తేదీని ప్రపంచ కవితా దినోత్సవంగా పాటించాలని నిర్ణయించారు. గురువారం కవితా దినోత్సవం సందర్భంగా జిల్లా కవుల అభిప్రాయాలు..

కదిలించే కవిత్వం

మానవత్వాన్ని తట్టి లేపుతుంది



కడుపులోంచి తన్నుకువచ్చే దు:ఖం నా కలం. వలవలా శోకంలా రాలిన కన్నీరు నా కవితాత్మ. కవిత్వమే నా హృదయం. కవిత్వమే నాకు ప్రాణ వాయువు. కవిత్వం మనిషిలోని మానవత్వాన్ని తట్టి లేపుతుంది. మనిషి కవిత్వాన్ని అవాహన చేస్తే జీవితం కడిగిన ముత్యం అవుతుంది.

– అన్నవరం దేవేందర్, సాహితీవేత్త

ప్రజల పక్షాన నిలవాలి



కవిత్వం హృదాయాలను కదిలించే విధంగా ఉండాలి. సమాజ చైతన్యానికి దోహదం చేయాలి. రుగ్మతల నివారణకు ఉపయోగపడాలి. పాలకులను అప్రమత్తం చేసేలా ఉండాలి. కవులు తమ రచనలతో ప్రజల పక్షాన నిలవాలి. ప్రజల సమస్యలను కవిత్వం అద్దం పట్టాలి.

– దాస్యం సేనాధిపతి, కవి, రచయిత, విమర్శకుడు

ఆటోనే కవిని చేసింది



ఆటో నడుపుకుని జీవించే నన్ను ఓ వర్ధమాన కవిగా నిలుపుతోంది కవిత్వమే. ఎన్నీల ముచ్చట్ల ద్వారా కవితా స్ఫూర్తితో ఈ రంగంలోకి అడుగిడిన నేను ప్రపంచ తెలుగు మహాసభల్లో నా కవిత్వాన్ని వినిపించాను. పలువురి కవితలను చదవడం, కవి సమ్మేళనాలకు హాజరుకావడం నాలో కవిత్వంపై మరింత ఆసక్తిని పెంచింది.

– ఖాలీద్, ఆటో కవి

సమాజహితం కోరుకుంటుంది



సాహిత్యం అంటే సమాజానికి హితాన్ని చేకూర్చేది. సమాజంలో ఎంత ఎక్కువగా కవులు తయారైతే అంత మంచి జరుగుతుంది. స్పందించే గుణం, చైతన్యాన్ని చూపించే గుణం కవులలో అధికం. అందుకే కవి అనేవాడు ప్రతి చిన్న విషయానికి స్పందిస్తాడు, ప్రతి సంఘటనను కవిత్వీకరిస్తాడు. అందుకే కవులను ప్రోత్సహించాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

– గాజుల రవీందర్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు

ఓట్ల కోసం వచ్చేవారిని నిలదీయాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్

గోదావరిఖని: గత ఎన్నికల్లో హామీ ఇచ్చి అమలు చేయని కాంగ్రెస్ నాయకులు.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం వస్తే ప్రజలు నిలదీయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ కోరారు. బుధవారం స్థానిక ప్రధాన చౌరస్తాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందరోజుల్లో కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే ఇప్పటివరకు అభివృద్ధి పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు రూ.2,500 భృతి, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. డీఎంఎఫ్‌డీ ద్వారా రూ.54కోట్లు, టీయూఎఫ్ఐడీసీ కింద రూ.వందకోట్లు గతంలోనే మంజూరయ్యాయని అన్నారు. ఆ నిధులతోనే ఇప్పుడు వివిధ అభివృద్ధి పనులు చేయిస్తున్నారన్నారు. ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప కొత్తగా ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. తక్కళ్లపల్లి గ్రామంలో పంటలకు నీరందక ఎండిపోతున్నాయన్నారు. రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. 17ఎల్, 27ఎల్ పునరుద్ధరణ కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.80కోట్లు మంజూరు చేసిందని, దీన్ని వెంటనే పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని అన్నారు. అలాగే యాసంగి వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీకి ఓట్లడిగే హక్కులేదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని ఆయన అన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, నాయకులు మురళీధర్‌రావు, చల్లగురుగుల మొగిలి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను కాటేసిన కరెంట్



వరి పొలంలో రాజయ్య మృతదేహం

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తి గ్రామంలో గుండారపు రాజయ్య(60) అనే రైతు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డిల కథనం ప్రకారం.. కనగర్తి గ్రామానికి చెందిన ఆరెల్లి వీరయ్య– దీవెనమ్మకు చెందిన పొలాన్ని రాజయ్య కౌలుకు తీసుకున్నాడు. ఈ యాసంగిలో వరి పండిస్తున్నాడు. రోజూమాదిరిగానే బుధవారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. పొలంలో కిందపడి ఉన్న విద్యుత్ తీగను గమనించక దానిపై అడుగు వేశాడు. వెంటనే విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఎడ్డెమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై కూలీ మృతి

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు రంగంపల్లిలో ఓ పాత ఇంటిని కూల్చే పనులు చేస్తున్న కూలీ ఒల్లెపు ఉపేందర్ (25) ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై బుధవారం మరణించాడు. పట్టణంలోని శాంతినగర్ ప్రాంతంలో నివాసముంటున్న ఉపేందర్ పాత ఇంటిని కూల్చుతుండగా అందులో ఉన్న ఓ ఇనుపరాడ్ ఇంటికి సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సైలు సుధాకర్‌రావు, మల్లేశ్ ఘటనాస్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

గుండెపోటుతో ఏఎస్సై మృతి



కిషన్(ఫైల్)

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్న మార్కొండ కిషన్ (59) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. కరీంనగర్ జ్యోతినగర్‌లో ఉంటున్న కిషన్ తన ఇంట్లోనే గుండెలో నొప్పి రావడంతో చనిపోయాడు. జిల్లాలోని తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లికి చెందిన కిషన్ 1984లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరారు. 40ఏళ్లు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పని చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అతి ఉత్కృష్ట సేవ పతకం అందుకున్నారు. కిషన్‌కు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతని స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి.

నిబంధనలకు విరుద్ధంగా 'గురుకుల' నిర్వహణ

- వసతులు, సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ డిమాండ్



భోజనం కోసం లైన్‌లో ఉన్న విద్యార్థులు

జమ్మికుంట: గంగ్రపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా సాంఘిక సంక్షేమ గురుకుల(బాలికల)పాఠశాల నిర్వహణ జరుగుతోందని, వసతులు, నిర్వహణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడికుమార్ డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలను బుధవారం సందర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. వేడినీళ్లు పడి తీవ్రగాయాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల బిల్డింగ్‌లోకి వర్షం నీరు చేరి దుర్వాసన వస్తోందని, పాఠశాల ఆవరణలో విద్యుత్ వైర్లు కిందకి వేలాడుతున్నాయని, ఫ్లోరింగ్‌లేదని, వంటగది అపరిశుభ్రంగా ఉందని, భోజనంలో నాణ్యత లేదని ఆరోపించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్యాటరింగ్ సిబ్బంది, మరుగుదొడ్ల నిర్మించాలన్నారు. పని చేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలన్నారు. సంబంధిత అధికారులు భవనాన్ని ఖాళీ చేయించి మౌలిక వసతులు ఉన్న నూతన భవనంలోకి మార్చాలని లేదంటే సొంత భవనం నిర్మించాలన్నారు. అలా చేయకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు గుజ్జుల అశోక్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.